
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

బుధవారం 22 మే 2024

వైభవంగా నరసింహ జయంతి ఉత్సవాలు 7లో..

'అమ్మ ఆదర్శం' పనులకు ఆటంకం.. 8లో..



పంట బీమాపై ఆశలు

- ప్రీమియం చెల్లించనున్న ప్రభుత్వం
- వానాకాలం సీజన్ నుంచి అమలుకు నిర్ణయం
- కసరత్తు చేస్తున్న వ్యవసాయ శాఖ
- నేడు అధికారులు, ఉద్యోగులకు ఓరియంటేషన్‌లో దిశ నిర్దేశం

జగిత్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రానున్న వానాకాలం సీజన్‌లో అమలు చేయనున్న పంటల బీమా పథకంపై వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరడం, ప్రీమియం చెల్లింపు బీమా పరిహారం తదితర వాటితో పాటు పొరుగు రాష్ట్రాల్లో పంటల బీమా పథకం ఎలా అమలవుతున్నాయనే దానిపై అధ్యయనం చేస్తోంది. గతంలో అమలు చేసిన పంటల బీమా పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 95 శాతం ప్రీమియాన్ని, మిగిలిన అయిదు శాతం ప్రీమియాన్ని రైతులు చెల్లించే వారు. పరిహారం పొందడంలో సమస్యలు ఉండటం, పెద్దగా రైతులకు ఉపయోగం ఉండటం లేదనే కారణంతో గత ప్రభుత్వం బీమా పథకాన్ని అమలు చేయలేదు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి పథకాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పాటు ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించాలనే నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఈనెల 22వ తేదీన ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రాంతాల జిల్లా, డివిజన్, సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ, సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులకు ఓరియంటేషన్ సమావేశాన్ని కరీంనగర్‌లో నిర్వహించి దిశ నిర్దేశం అధికారులు చేయనున్నారు.

జిల్లాలో 4.24 లక్షల ఎకరాల్లో సాగు...

జిల్లా వ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణం కంటే అధికంగా వానాకాలంలో పంటల సాగు అవుతుందన్న అంచనాను అధికారులు వేశారు. జిల్లాలో సుమారు 1.60 లక్షల మంది రైతులున్నారు. జిల్లా వ్యాప్తంగా పంటలు సాధారణ సాగు విస్తీర్ణం 3,35,978 ఎకరాలు కాగా ఈ సీజన్‌లో 4,24,425 ఎకరాలు సాగు చేస్తారని అంచనా వేశారు. మండలాల్లోని క్లస్టర్ల వారీగా సాగు విస్తీర్ణం అంచనాలను వ్యవసాయ అధికారులు రూపొందించారు. ఇందులో ప్రధానంగా వరి 3,05,000 ఎకరాలు, మొక్కజొన్న 41,000 ఎకరాలు, కందులు 2,500, పెసర్లు 150, ఇతర పప్పులు 675, సోయా చిక్కుడు 600, పత్తి 20,200, చెరుకు 1,200 ఎకరాలు, పసుపు 11,000, ఇతర పంటలు 42,100 ఎకరాల్లో సాగుకానున్నట్లు అధికారులు అంచనా వేశారు.

యేటా ఏదో రకంగా పంటల నష్టం...

జిల్లాలో వరి ప్రధాన పంటగా, తరువాత ఎక్కువగా మొక్కజొన్న, పత్తి సోయా, కందులు, పెసర్లు, చెరుకు పంటలను సాగు చేస్తారు. ఇతర పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగవుతాయి. యేటా ఏదో రకంగా రైతులు పంటలను నష్టపోతున్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకునేందుకు వీలుగా ప్రభుత్వం పంట బీమా పథకం అమలు చేస్తోంది. గతంలో బ్యాంకు నుంచి రుణం పొందే రైతులకు పంట బీమా తప్పని సరి చేశారు. రుణంతో సంబంధం లేకుండా పంటలను సాగు చేసే రైతులు మాత్రం బీమా చేయడమనేది వారి ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. తర్వాత ప్రీమియం చెల్లింపు అనేది రైతుల ఇష్టానికి వదిలేశారు. పత్తికి వాతావరణ ఆధారిత, సోయాకు గ్రామం యూనిట్, ఇతర పంటలకు మండల యూనిట్‌గా బీమా పథకాన్ని అమలు చేశారు. తాజాగా ఏయే పంటలకు బీమా వర్తింపజేస్తారు, ప్రీమియం, పరిహారం, బీమా ఎలా అమలు అనేది తేల్చాల్సి ఉంది. వీటికి సంబంధించి వ్యవసాయశాఖ అధ్యయనం చేస్తోంది.

బీమా పథకం పక్కాగా అమలు..

కొత్తగా అమలు చేయనున్న పంటల బీమా పథకాన్ని పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు ఇప్పటికే క్లస్టర్ల వారీగా వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న క్రాప్ బుకింగ్‌ను పరిగణనలోకి తీసుకోనున్నారు. చాలా మంది ఏఈవోలు పంట పొలాలకు వెళ్లకుండా, రైతులను అడిగి రాస్తుండటం, పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల్లో పంటల నమోదుపై గొడవలు జరుగుతుండటంతో పంటల బీమాను పకడ్బందీగా అమలు చేయాలంటే బయోమెట్రిక్ తీసుకోవడంతోపాటు రైతుల నుంచి డిక్లరేషన్ తీసుకోవాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతుండటంతో పంటల బీమా పథకాన్ని త్వరగా తేల్చాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లాల వారీగా పంటల సాగు అంచనాలు, ప్రీమియం తదితర వాటికి సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని కోరారు. పంటల బీమాకు సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించడం, బీమా కంపెనీలను సంప్రదించడం, ప్రీమియాన్ని నిర్ధారించడం, ప్రభుత్వ బడ్జెట్ విడుదల చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనతో వచ్చే ప్రయోజనాలు వినియోగించుకోవడంతో పాటు రైతులపై ఎలాంటి భారం పడకుండా పంటల బీమా పథకాన్ని అమలు చేయనుంది. వానాకాలం సీజన్ నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న పంటల బీమా పథకంపై రైతులు ఆశలు పెంచుకుంటున్నారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకే...

వాణి, జిల్లా వ్యవసాయ అధికారి, జగిత్యాల



జిల్లాలో ప్రభుత్వ నిర్ణయం మేరకు పంట బీమా పథకాన్ని అమలు చేయడానికి అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నాము. ఇప్పటికే ఇందుకు అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని సిద్ధం చేశాము. రానున్న వానాకాలంలో జిల్లాలో సాగయ్యే పంటల వివరాలు, సాగు అంచనా వేశాము. అధికారులు, ఉద్యోగులకు సైతం అవసరమైన దిశ నిర్దేశం చేయడం జరిగింది.

రాజీవ్ గాంధీ జీవితం ఆదర్శప్రాయం

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

జగిత్యాల టౌన్, మే 21: రాజీవ్ గాంధీ జీవితం ఆదర్శప్రాయమని ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడువాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో మంగళవారం దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హాజరై రాజీవ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. సాంకేతిక విప్లవానికి నాంది పలికి, ప్రపంచ శాంతి నెలకొల్పేందుకు కృషి చేసి. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్, నాయకులు అడువాల లక్ష్మణ్, మహంకాళి రాజన్న, శోభారాణి, సరిత, అనిత, లత, రాజేందర్ ఉన్నారు.

టీఎస్ స్థానంలో టీజీ తక్షణమే అమలు చేయాలి

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు టీఎస్ స్థానంలో టీజీ తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను మంగళవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇప్పటివరకు రాష్ట్ర అబ్రియేషన్స్ సూచించే టీఎస్ స్థానంలో టీజీని వినియోగించుకునేందుకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిన దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని తెలిపారు. జిల్లాలో ఇకపై అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, ఏజెన్సీలు, పబ్లిక్ సెక్టార్ యునిట్లు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలు, వెబ్ సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్ ఫారములు ఏదయినా ఇతర అధికారిక కమ్యూనికేషన్లు సైతం తెలంగాణ కోడ్‌ను టీఎస్ బదులుగా టీజీని వాడాలని ఆదేశించారు. లెటర్ హెడ్లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్ సైట్లు పాలసీ పేపర్లు, జీవోలన్నింటిపై మార్పును అమలు చేయాలన్నారు. ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా భవిష్యత్తులో నిర్వహించే ఉత్తర ప్రత్యుత్తరాలలో టీఎస్‌కు బదులుగా టీజీని ముద్రించాలని సూచించారు. ఈమేరకు తీసుకున్న చర్యలపై ఈనెల 25వ తేదీలోపు అన్ని శాఖల అధికారులు నివేదికలు పంపాలని, అట్టి నివేదికలు క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదికను పంపనున్నట్లు తెలిపారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



దొనూర్ గ్రామంలో మాట్లాడుతున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. రైతుల సౌకర్యార్థం ఐకేపీ ఆధ్వర్యంలో సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడం అభినందనీయమని దొనూర్ గ్రామంలో సకాలంలో ధాన్యం కొనుగోలు చేసిన నిర్వాహకులను ఆయన మంగళవారం శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు అధైర్య పడవద్దని, ధైర్యంగా ఉండాలన్నారు. రైతులకు వానా కాలంలో విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుల చిలుముల లక్ష్మణ్, గొల్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముస్కు నిశాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నర్సింహులు, సరేందర్, పురుషోత్తం పాల్గొన్నారు.

నిల్వఉన్న బస్తాలను మిల్లులకు తరలించాం

పౌరసరఫరాల జిల్లా అధికారి వెంకటేశ్వర్‌రావు

జగిత్యాలరూరల్, మే 21 : కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించామని జగిత్యాల జిల్లా పౌరసరాఫరాల అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం జగిత్యాల అర్బన్ మండలంలోని తిప్పన్నపేట ఐకేపీ సెంటర్‌ను సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో నిల్వఉన్న ధాన్యం బస్తాలను సంబంధిత మిల్లులకు తరలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోళ్లు పూర్తిచేసి త్వరలోనే ముగిస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట అర్బన్ డీటీ తిరుపతి, ఏపీఎం గంగాధర్, తదితరులు ఉన్నారు.

నత్తనడకన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు

కంకర రోడ్డుతో నరకయాతన పడుతున్న ప్రయాణికులు



పెగడపల్లి మల్యాల కంకర రోడ్డు దుస్థితి



ఏడాది క్రితం వేసిన శిలాఫలకం

పెగడపల్లి, మే 21 : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా ఉంది పెగడపల్లి మండల ప్రజల పరిస్థితి. పెగడపల్లి నుంచి జగిత్యాల వెళ్లేందుకు డబుల్ రోడ్డు లేక ఎన్నో ఏండ్లుగా ఇబ్బందులు పడుతూ ప్రయాణికులకు పెగడపల్లి మండల కేంద్రం నుంచి మల్యాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి గాను సీఆర్ఎఫ్ నిధులు రూ. 20 కోట్లు ప్రభుత్వం ఏడాదిన్నర క్రితం మంజూరు చేసింది. నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకుని అప్పటి మంత్రులు, ఎమ్మెల్యేల అనుమతితో గత సంవత్సరం 25 ఫిబ్రవరి 2023న రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా శిలాఫలకాలు ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభంతో ప్రయాణ కష్టాలు తీరనున్నాయని ఆశపడ్డ ప్రయాణికులకు ఏడాదిగా పనులు నత్తనడకన సాగుతుండటం, మూడు నెలలుగా పనులు పూర్తిగా నిలిచిపోవడంతో కంకర రోడ్డుపై ప్రయాణించలేక ఇబ్బందులు పడుతున్నారు.

కలెక్టరేట్‌లోని వివిధ కార్యాలయాలకు, కోర్టు పనులకు, ఇతర పనుల నిమిత్తం నిత్యం జగిత్యాలకు వెళ్లే ప్రయాణికులు కంకర రోడ్డుపైన ప్రయాణ బాధలతో దూర భారం ఎక్కువైనా చిల్వాకోడూర్ గొల్లపల్లి మీదుగా జగిత్యాలకు వెళ్లి వస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించి కంకర రోడ్డుపై నరకయాతన నుంచి విముక్తి కల్పించాలని మండల ప్రజలు ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రమాదకర గుంతను పట్టించుకోరా?



భూషణరావుపేటలో రోడ్డుపై ఉన్న ప్రమాదకర గుంత

కథలాపూర్, మే 21 : ప్రతీదినం వందలాది మంది ఈ రోడ్డుపై నడుస్తుండగా పక్కనే ఉన్న గుంత ప్రమాదకరంగా ఉంది. మండలంలోని భూషణరావుపేటలో మిషన్ భగీరథ నీటి పైపులకు సంబంధించి గేట్ వాల్స్ కోసం ఏర్పాటు చేసిన ఈ గుంతపై ఉండే స్లాబ్ ధ్వంసం కావడం వల్ల ప్రమాదం పొంచి ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. వాహనదారులకు, పాదచారులకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రాత్రివేళల్లో దగ్గరి దాకా వెళ్తేగానీ ఈ గుంత ఉన్నట్టు తెలియడం లేదని వాపోతున్నారు. పలుమార్లు చిన్నారులు ఈ గుంతలో పడి గాయపడ్డారని స్థానికులు తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారులు ఈ ప్రమాదకర గుంతను పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

రాయికల్, మే 21: మండలంలోని మంగ్యానాయక్ తండాకు చెందిన బానోతు కైక ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ పాలకుర్తి రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండపల్లి రవీందర్ రావు, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు మాలోతు ప్రసాద్ నాయక్, గిరిజన మండల అధ్యక్షుడు బానోతు రమేష్ నాయక్ పాల్తే, మంగీలాల్ నాయక్, బోదాసు రాజరెడ్డి, బోదాసు జలపతి, ఒడ్డెలింగాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాగుల మహేష్ గౌడ్ పాల్గొన్నారు.

రేచపల్లిలో ఎమ్మెల్సీ పర్యటన

సారంగాపూర్ : మండలంలోని రేచపల్లి గ్రామంలో మంగళవారం నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నాయకులు, ప్రజలతో కలిసి ఓటింగ్ సరళి, గ్రామానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. నాయకులు మాజీ జడ్పీటీసీ భూక్య సరళ, ప్రసాద్‌గౌడ్, తిరుపతి రెడ్డి, రాజన్న, మహేష్, హరీష్, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసనలు

- మంత్రి పొంగులేటి వ్యాఖ్యలకు నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- అన్ని రకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్



ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గొల్లపల్లి, మే 21 : సన్న వడ్లకు రూ. 500 వందల బోనస్ ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గొల్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో మండలం నలుమూలల నుంచి తరలివచ్చిన పార్టీ శ్రేణులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారి పై ఆందోళన నిర్వహించి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. జడ్పీటీసీ జలేందర్ మాట్లాడుతూ అన్ని రకాల ధాన్యానికి రూ. 5 వందల బోనస్ ఇస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం మాట తప్పి రైతులను, ప్రజలను వంచించారంటూ ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేశారు. అన్ని రకాల వరి ధాన్యానికి రూ. 5 వందల బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ మండల కో-ఆర్డినేటర్ గంగాధర్, మండల ప్రధాన కార్యదర్శి బాబు, బీసీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు కిషన్, బీఆర్ఎస్వీ మండల శాఖ అధ్యక్షుడు చందు, ఎంపీటీసీ లు లక్ష్మీగంగారెడ్డి, రాజ్యలక్ష్మీరవి, మాజీ ఉప సర్పంచ్ రాజశేఖర్, పాల్గొన్నారు.

పెగడపల్లి: ఎన్నికల హామీలలో ఇచ్చిన మేనిఫెస్టోకు అనుగుణంగా అన్ని రకాల ధాన్యానికి బోనస్ అందించాలని డిమాండ్ చేస్తూ పెగడపల్లి మండల కేంద్రంలో మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే మాట మార్చి సన్న రకం ధాన్యానికి మాత్రమే బోనస్ అందిస్తామనడం రైతులను మోసం చేయడమేనంటూ అంబేద్కర్ కూడలిలో ప్రధాన రహదారిపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి, బండి వెంకన్న, నాయకులు గోలి సురెందర్‌రెడ్డి, గంగాధర్, మాదారపు కరుణాకర్ రావు, రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

బుగ్గారం: ఎన్నికల హామీలలో ఇచ్చిన మేనిఫెస్టోకు అనుగుణంగా అన్ని రకాల ధాన్యానికి బోనస్ అందించాలని డిమాండ్ చేస్తూ బుగ్గారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మంగళవారం బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద పభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి నిరసన తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గాలిపల్లి మహేష్, మాజీ మండల అధ్యక్షుడు సిర్నేనేని మల్లేషం, మండల యూత్ అధ్యక్షుడు కట్ట రాజేందర్, మండల కో ఆప్షన్ సభ్యులు అబ్దుల్ రహమన్ పాల్గొన్నారు.

మల్యాల: సన్నరకం ధాన్యానికే బోనస్ ఇస్తామనడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను వంచించినట్లేనని దొడ్డు రకం ధాన్యంకు కూడా బోనస్ ఇవ్వాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, జనగాం శ్రీనివాస్, బద్దం తిరుపతిరెడ్డి, రౌతు రవి, జోగినిపల్లి శ్రీనివాస్ గౌడ్, సాగర్, రూపేష్ పాల్గొన్నారు.



పెగడపల్లిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

ఎండపల్లి: అన్ని రకాల వడ్లకు 500 బోనస్ ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకులు మంగళవారం రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సింహాచలం జగన్, ఎంపీటీసీ గాజుల మల్లేషం, చెంద్రారెడ్డి, మైలారపు సతీష్, కృష్ణ, రియాజ్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: దొడ్డు వడ్లు పండించిన రైతులకు ప్రభుత్వం రూ.. 500 బోనస్ ఇవ్వాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పులి వెంకటేష్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం కొడిమ్యాల గ్రామ శివారులోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు రాజేశం, లక్ష్మారెడ్డి, స్వామి, ఆనందం, తిరుపతి, రాజు, శుకూర్, రాకేష్, చంద్రమోహన్, సాగర్ పాల్గొన్నారు.

విలీన ప్రక్రియ ముందుకు సాగేనా?

● డోలాయమానంలో ఆర్టీసీ ఉద్యోగులు ● ప్రభుత్వం స్పందించాలని వినతి

భగత్‌నగర్, మే 21: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినా ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదు. 2019 సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ ఉద్యోగులు విలీనం చేయాలని సమ్మె చేసినా ఆ దిశగా అడుగులు వేయని ప్రభుత్వం 2023 ఆగస్టు నెలలో ఒక్కసారిగా విలీన ప్రక్రియను ముందుకు తీసుకు వచ్చి మంత్రివర్గ సమవేశంలో చర్చించి బిల్లును ఏకగ్రీవ తీర్మానంతో ఆమోదించారు. విలీన బిల్లుకు సెప్టెంబరులో గవర్నర్ ఆమోదముద్ర వేయడంతో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ తంతు ముగిసినా విధి విధానాల రూపకల్పనకు ఓ కమిటీని వేసింది. ఆ తర్వాత వచ్చిన ఎన్నికల కోడ్‌లతో విలీన ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. ఆర్టీసీ కార్మికుల సమ్మె కాలంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యోగులకు మద్దతు ప్రకటిం చిన నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగు లు విలీన ప్రక్రియపై ఆశలు పెట్టుకున్నారు.

కరీంనగర్ రీజియన్‌లో 3,472 మంది ఉద్యోగులు

కరీంనగర్ రీజీయన్‌లో 11 ఆర్టీసీ డిపోలు ఉండగా 3472 మంది ఉద్యో గులు ఉన్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, గోదావరిఖని, జగిత్యాల, వేములవాడ, సిరిసిల్ల, మంథని, హుజూరాబాద్, హుస్నాబాద్, కోరుట్ల, మెట్‌పల్లి డిపోలు ఉన్నాయి. గోదావరిఖనిలో 524 మంది ఉద్యోగులు, హుస్నాబాద్‌లో 210, హుజూరాబాద్‌లో 253, కరీంనగర్-1 డిపోలో 423, కరీంనగర్-2లో 384, మంథనిలో 211, జగిత్యాలలో 435, కోరుట్లలో 226, మెట్‌పల్లిలో 231, సిరిసిల్లలో 266, వేములవాడలో 250 మంది ఉద్యోగులతో పాటుగా మిగతా 59 మంది కలుపుకుని 3472 మంది ఉద్యోగులు ఉన్నారు. ఆర్టీసీ విలీన ప్రక్రియ పూర్తయితే రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11 డిపోల పరిధిలోని ఉద్యోగులందరికీ లాభం జరిగే అవకాశం ఉంది.

ఆందోళనలో రిటైర్డ్ ఉద్యోగులు

కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా ప్రభుత్వం విలీన ప్రక్రియ గెజిట్ పబ్లిష్ చేసిన తర్వాత అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు రిటైర్డ్ అయిన వారి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. విలీన ప్రక్రియ ముగిసిన తర్వాత తమకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా రావాల్సిన మొత్తాలను అందించాలని రిటైర్డ్ అయిన ఉద్యోగులు కోరుతున్నారు. గత సెప్టెంబర్ నెలలో 8 మంది, అక్టోబర్ నెలో 8 మంది, నవంబర్ నెలలో 8, డిసెంబర్ నెలలో 11 మంది, జనవరి నెలలో 15 మంది, ఫిబ్రవరి నెలలో 10, మార్చి నెలలో 13 మంది, ఏప్రిల్ నెలలో 20 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. గత సంవత్సరం విలీన ప్రక్రియ గెజిట్ విడుదల అయినప్పటి నుంచి ఇప్పటి వరకు 93 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని ఆర్టీసీ విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

జూలై 3 నుంచి ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

కరీంనగర్ స్పోర్ట్స్, మే 21: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అగ్నివీర్ వాయు (సంగీతకారుడు) రిక్రూట్‌మెంట్ ర్యాలీని జూలై 3 నుంచి 12 వరకు నిర్వహించనున్నారు. 3ఎఎస్‌సీ ఎయిర్‌ఫోర్స్ సంస్థ ఖాన్‌పూర్, 7ఎఎస్‌సీ, 1 కబ్బన్‌రోడ్, బెంగుళూరు కర్ణాటకలో నిర్వహించనున్న ఈ ర్యాలీలో పాల్గొనటానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెళ్లి కాని భారతీయ పురుషులు, మహిళల కోసం అగ్నివీర్ వాయు కోసం రిజిస్ట్రేషన్ ఆధారిత రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహిస్తుం దన్నారు. దీనికి సంబంధించి ఇంటెక్ 01/2025 రిక్రూట్‌మెంట్ కోసం జాబ్ నోటిఫికేషన్ జారీ అయిందన్నారు. అగ్నిపథ్ పథకం ప్రవేశంతో క్లరికల్/టెక్నికల్ క్యాడర్లలో ఉద్యోగావకాశాలు ఇపుడు నాలుగు సంవత్సరాల సర్వీసుకు పరిమితం చేయబడుతుందని, అభ్యర్థులలో 25శాతం మందికి శాశ్వత ప్రవేశం కల్పించ బడుతుందని పేర్కొన్నారు. అభ్యర్థి అవివాహితుడై, 2జనవరి, 2004 నుంచి 2 జూలై 2007 మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి కనీస పాస్ మార్కులతో పదవ తరగతి ఉత్తీర్ణత/సమాన విద్య కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు టెంపో, పిచ్, ఒక పూర్తి పాట పాడడంలో కచ్చితత్వంతో సంగీతంలో ప్రావీణ్యం కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 22 ఉదయం 11 గంటల నుంచి జూన్ 5 వరకు రాత్రి 11 గంటల వరకు వెబ్‌పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

జగిత్యాల టౌన్, మే 21:జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎల్లాల గోపాల్ రెడ్డి తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా గోపాల్ రెడ్డి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ట్రేస్ చేసి రికవరి చేశారు. మంగళవారం బాధితుడికి సీఐ వేణు గోపాల్ చేతుల మీదుగా అందజేశారు. టౌన్ ఎస్సై నరేష్, మన్మధరావు ఉన్నారు.

విద్యుత్ స్తంభాలకు ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

సిరిసిల్ల క్రైం, మే 21: సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌లో మంగళవారం ఉదయం ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాలను ఢీకొంది. మానేరువాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సాయినగర్ రోడ్డుపై వెళ్తోంది. అజాగ్రత్తతో అతివేగంగా డ్రైవింగ్ చేయడంతో అదుపుతప్పి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మూడు స్తంభాలు విరిగి కిందపడ్డాయి. తీగలు తెగిపోయాయి. దీంతో ఆ కాలనీలోని పలు ఇళ్లల్లో టీవీలు, రిఫ్రిజిరేటర్‌లు ఒక్కసారిగా కాలిపోయాయి. ఏం జరిగిందోనని ప్రజలు ఆందోళన చెందారు. ప్రమాదం జరిగిన కొంత సేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లన్నీ సాయినగర్ కాలనీలో నిలిచిపోవడంతో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ప్రతీ రోజు ఇసుక రవాణాతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆందోళన చేశారు. ఈ సంఘటన తెలుసుకున్న సెస్ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరణలో నిమగ్నమయ్యారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 21: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. నారాయణపూర్ గ్రామ సమీపంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావు తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపారని పేర్కొన్నారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశామని చెప్పారు. నారాయణపూర్‌కు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పోదరి రాకేశ్, వాహన యజమాని గోగూరి ప్రభాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



ఆలయం ఎదుట భక్తులు

మల్యాల, మే 21: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవుల నేపథ్యంలో సోమవారం రాత్రికే వేలాదిగా కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకోడానికి బారులు తీరారు. అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఏఈవో అంజయ్య ఇతర అధికారులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది. కాగ కొండ పైన అలిశెట్టి విష్ణు అనే భక్తుడు సెల్‌ఫోన్, నగదుతో కూడిన బ్యాగ్ పోగొట్టుకోగా ఏఎస్సై చిలుక శ్రీనివాస్ సిబ్బందితో వెతికి భక్తుడికి అప్పగించారు.

రూ. 7,400 పలికిన పత్తి ధర



జమ్మికుంట రూరల్, మే 21: జమ్మి కుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,400 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 22 మంది రైతులు 270క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు ఏడు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,400, కనిష్ఠ ధర ఐదు వేలు చెల్లించి కొన్నారు.

వివాహిత హత్య



మమత (ఫైల్)

మెట్‌పల్లి, మే, 21 : మెట్‌పల్లి పట్టణానికి చెందిన సంగం మమత(38)అనే మహిళ మంగళవారం హత్యకు గురైంది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం..పట్టణానికి చెందిన సంగం మమత కొంత కాలంగా అబ్దుల్ అఫ్సర్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం నడిపిస్తోంది. మమత తన భర్తతో నాలుగేళ్ల క్రితం విడాకులు తీసుకుని కొడుకు, కూతురుతో కలిసి పట్టణంలోని వేరుగా ఉంటోంది. అఫ్సర్ తరుచుగా మమత ఇంటికి వస్తూ ఉండే వాడు. సోమవారం రాత్రి మమత, అఫ్సర్‌ల మధ్య గొడవ జరిగింది. అఫ్సర్ కోపంతో మమ తను గొంతు నులిమి, కత్తితో పొట్టలో పొడవడంతో తీవ్ర రక్తస్రావంతో పడిపోయిం ది. గమనించిన కూతురు 108లో ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతి చెందిన ట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్, ఎస్సై చిరంజీవి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను సేకరించారు. మమత కూమారుడు సంగం గ్రహిత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం



ధర్మపురి, మే 21: ధర్మపురి మండలంలోని రాయపట్నం నది బ్రిడ్జి కింద గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మృతుడు సుమారు 45 ఏళ్ల వయస్సు కలిగి ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో గల మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

శంకరపట్నం, మే 21: మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల హన్మంతు (70) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపల్లి గ్రామానికి చెందిన బొంతల హన్మంతుకు అతని తమ్ముడు బొంతల సమ్మయ్యతో భూవివాదం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. సమ్మయ్య హన్మంతును, అతని కుటుంబ సభ్యులను తిడుతూ చంపుతానని బెదిరించాడు. దీంతో హన్మంతు మనస్తాపానికి గురై ఈ నెల 18న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం అర్ధరాత్రి చికిత్స పొందతూ మృతి చెందాడు. మంగళవారం హన్మంతు కుమారుడు బొంతల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.

రెండు ఇసుక లారీల పట్టివేత

జమ్మికుంట రూరల్, మే 21: మండలంలోని విలాసాగర్ సమీపంలోని మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. నాగంపేట గ్రామం వద్ద హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి, పెట్రోలింగ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా విలాసాగర్ మానేరు నుంచి వస్తున్న రెండు ఇసుక లారీలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. లారీల యాజమానులు వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చందుపట్ల జితేందర్‌రెడ్డి, వేములవాడకు చెందిన ముద్రకోల మహేష్, డ్రైవర్లు జాన ప్రశాంత్, ఎరుకల అంజయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

రుద్రంగి మే 21: మద్యం మత్తులో లారీ డ్రైవర్ బీభత్సాన్ని సృష్టించిన సంఘటన రుద్రంగి మండల కేంద్రంలో బస్టాండ్ ప్రాంతంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం మానాల గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి వెళ్తున్న క్రమంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో బస్టాండ్ ప్రాంతంలోని డివైడరును ఢీకొని డివైడర్ పైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ సిరిసిల్ల అశోక్ పరిశీలించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అదుపు తప్పి వ్యాన్ బోల్తా

మానకొండూరు, మే 21: మండలంలోని అన్నారంలో మంగళవారం ఓ వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. వివరాలు ఇలా ఉన్నాయి కరీంనగర్ నుం చి మండలంలోని అన్నారం గ్రామానికి వరివిత్తనాలతో వ్యాన్ బయలు దేరింది. అన్నారం గ్రామంలోని మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాలకుర్తి, మే 21: పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం పరిధిలోని వేంనూర్ గ్రామంలో సోమవారం రాత్రి రెండు ద్వీచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో గాయపడిన దీకొండ మహేందర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపారు. మహేందర్ కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రాగంపేట గ్రామానికి చెందిన వ్యక్తి అని ఎస్ఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు

మల్లాపూర్, మే, 21 : మండలంలోని ముత్యంపేట గ్రామంలోని వాకిటి గంగవ్వ, మారు రాజశ్రీల ఇళ్లల్లోకి పిచ్చికుక్క చొరబడి దాడి చేసిన ఘటనలో మంగళవారం ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపి న వివరాల ప్రకారం..గ్రామంలో మధ్యాహ్నం వాకిటి గంగవ్వ అను వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తోంది. అదే సమయంలో పిచ్చికుక్క ఇంట్లోకి చొరబడి గంగవ్వ ముఖంపై, ఎదురింట్లో ఉన్న మారు రాజశ్రీ కాళ్లను కొరికి తీవ్రంగా గాయపరిచింది. గమనించిన స్థానికులు, కుంటుంబ సభ్యులు మెట్‌పల్లిలోని వారిని ఆసపత్రికి తరలించారు. గ్రామంలో పిచ్చికుక్కల బెడద నుంచి రక్షణ కల్పించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు.

వైభవంగా నరసింహ జయంత్యుత్సవాలు



నరసింహ స్వామివారు

ముగిసిన నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 21: ధర్మపురి క్షేత్రంలో శ్రీ నరసింహ జయంతి ఉత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 13 నుంచి ప్రారం భమైన నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాల శర్మ మంత్రోచ్ఛారణల మధ్య ఆలయ ముఖ్య అర్చ కులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు స్వామి వారలకు పురుష సూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసక పూర్వక, శోడషోపచార పూజ నిర్వహించారు. పంచోపనిషత్తులతో మన్యసూక్తం, నున్నాల వన్నము, రుద్రంతో అభిషేక పూజలు, విశేష పూజ లు, పంచోపనిషత్తులో అభిషేకం, సహస్ర నామా ర్చన, హారతి, వేద మంత్ర పుష్పం, చతుర్వేద అవధార్యాలు, ప్రత్యేక పూజలు, సప్త హారతులు నిర్వహించారు.

సాయంత్రం వేళలో స్తంభోద్భవ కాలంలో విశేష పూజలు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. నృసింహ జయంతి సందర్భంగా రాజగోపురాల కు, శ్రీ స్వామి వారలకు, దేవాల యాల కు ప్రత్యేక పూల అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం ప్రతి నిత్యం మూడు వాటర్ కూలర్స్‌తో పాటు అదనంగా మరో రెండు చోట్ల లడ్డూ కౌంటర్ ముందు, దేవాలయం ఎదుట చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు గోదావరిలో స్నానాలు చేసిన అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారలను దర్శిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఆలయ వేదపండి తులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి క్షేత్రంలో నరసింహ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి, దర్శనం చేసుకున్నారు. ఆలయ వేదపండితులు, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించి, స్వామి తీర్థ, ప్రసాదాలు అందించారు.







స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, స్వామి వారలకు హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, స్వామి వారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

క్రీడాకారులు ఐపీఎల్ స్థాయికి ఎదగాలి

కేడీసీఏ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 21: జిల్లా క్రీడాకారులు క్రికెట్ శిక్షణ శిబిరాలలో నేర్చుకున్న మెళ కువలతో మున్ముందు ఐపీఎల్ స్థాయికి ఎదగాలని కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్ మురళీధర్ రావు అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు మంగళవారం ఉదయం ముగిశాయి. జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల ఎదురుగా గల కేడీసీఏ ప్రధాన మైదానంలో గత నెల 20వ తేదీ నుంచి ప్రారంభమైన ఉచిత వేసవి శిక్షణ శిబిరం సోమ వారం ఉదయం ముగిసింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలను, శిక్షణ శిబిరాలు నిర్వ హిం చిన కోచ్‌లకు మెమొంటోను ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడా కారులు క్రమ శిక్షణకు మారు పేరుగా నిలవాలన్నారు. నెల రోజులుగా నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న అండర్ 14,16,19,23, వయసు విభాగాల బాల బాలికలకు ప్రశం సాపత్రాలను అందించారు.



క్రీడాకారుడికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మురళీధర్ రావు

మైతాపూర్ బ్రిడ్జి వద్ద ధాన్యం లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

రాయికల్, మే 21: మండలంలోని మైతాపూర్ బ్రిడ్జి వద్ద ధాన్యం తరలిస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. రాయికల్ నుంచి కోరుట్లకు ధాన్యం తీసుకువెళ్తున్న లారీ మైతాపూర్ బ్రిడ్జిపైకి రాగానే బోల్తా పడింది. మైతాపూర్ బ్రిడ్జిపై ఇటీవల కాంట్రాక్టర్ మట్టి పోయడంతో మట్టిలో దిగబడి లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. కాగా విషయాన్ని తెలుసుకున్న కౌన్సిలర్లు తురగ శ్రీధర్, వల్లకొండ మహేష్ గౌడ్, రైతులు బోల్తా పడిన లారీని, ధాన్యం బస్తాలను పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణం నత్తనడకన సాగుతుందని, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. బ్రిడ్జి పనులు నడుస్తున్నాయని హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడం బాధాకరమన్నారు. అలాగే పనులు నడుస్తున్నప్పుడు వాహనాలు వెళ్లడానికి కనీసం మట్టి రోడ్డు నిర్మాణం చేయలేదన్నారు. ఎక్కువ గుంతలు ఉండటంతో ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్లు మట్టి రోడ్డు నిర్మాణం చేయించి, బ్రిడ్జి పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

వడదెబ్బతో కౌలు రైతు మృతి



సుల్తానాబాద్, మే 21 : పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని బొంతకుంట పల్లి గ్రామానికి చెందిన పోలాడి నర్సింగరావు (70) అనే రైతు వడదెబ్బతో మృతిచెందాడు. తాను కౌలుకు తీసుకున్న 2 ఎకరాల్లో సోమవారం పెసర్లు ఏరికి ఇంటికి రాగా, ఎండ తీవ్రతకు అస్వస్థత గురయ్యాడు. మంగళవారం ఆసుపత్రికి వెళ్లి ఇంటికి రాగా సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య గతంలో మృతిచెందగా, పిల్లలు లేరు.

ఠాణా ఎదుట ఎస్సై భార్య ఆందోళన

● రెండో పెళ్లి చేసుకొని.. తమకు అన్యాయం చేస్తున్నాడని ఆవేదన





కుటుంబ సభ్యులతో ఆందోళన చేస్తున్న మానస, మానస, పిల్లలతో ఎస్ఐ నాగరాజు (ఫైల్)

చేర్యాల, మే 21 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఎస్సై నాగరాజు తనకు తెలియకుండా రెండో వివాహం చేసుకున్నాడని, పిల్లలను బలవంతంగా తీసుకెళ్లాడని అతడి మొదటి భార్య మానస మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ ఎదుట తల్లి, బంధువులతో కలిసి ఆందోళనకు దిగింది. నాగరాజు రెండో భార్య వల్ల తనకు, తన పిల్లలకు ప్రాణ హాని ఉందని, పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరుతోంది.

కరీంనగర్ జిల్లా గోపాల్ పూర్‌కు చెందిన మానసకు కొమురవెల్లి ఎస్సై నాగరాజుతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సుమారు రెండేళ్ల క్రితం ఎస్సై నాగరాజు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని మానసను వేధిస్తున్నాడు. కొంతకాలం క్రితం మానసను, పిల్లలను కరీంనగర్‌లో ఉంచాడు. అప్పుడప్పుడు అక్కడికి వచ్చి పోయేవాడు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. రెండు నెలల క్రితం బలవంతంగా పిల్లలను తీసుకెళ్లి.. వాళ్లు ఎక్కడున్నారో మానసకు చెప్పకుండా విడాకులు ఇవ్వాలని వేధిస్తున్నాడు. దీంతో మానస ఆత్మహత్యాయత్నం చేసుకుంటానని ఆమె సూసైడ్ నోట్ రాసి పెట్టుకోగా గమనించిన కుటుంబ సభ్యులు కలుగ జేసుకుని న్యాయం చేస్తామని చెప్పడంతో విరమించుకుంది. తన భర్త విషయాన్ని సిద్దిపేట సీపీ, చేర్యాల సీఐ, కరీంనగర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని బాధితురాలు వాపోతోంది. తనకు, తన ఇద్దరు పిల్లలకు ఎస్సై నాగరాజు రెండో భార్యతో ప్రాణహాని ఉందని, నాగరాజు, పిల్లలు తనతో కలిసి ఉండేలా న్యాయం చేయాలని ఆమె మంగళవారం కొమురవెల్లి పోలీస్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగింది. అయితే, ఎస్సై నాగరాజు సెలవులో ఉన్నారని సిబ్బంది చెప్పారు. తనకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన విరమించనని అక్కడే కూర్చుంది. ఈ విషయమై సీఐ శ్రీనును సంప్రదించగా, విషయాన్ని మానస ఇటీవల తన దృష్టికి తీసుకువచ్చారని.. కౌన్సెలింగ్ చేశామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎస్‌యూ ఇన్‌చార్జి వీసీగా సురేంద్రమోహన్



గణేశ్‌నగర్, మే 21: శాతవాహన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా సురేంద్రమోహన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న వీసీ పదవీ కాలం పూర్తి కావడంతో ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించింది. కొత్త వీసీలు నియమితులు అయ్యే వరకు వీరు విధుల్లో కొనసాగనున్నారు. ఇప్పటికే కొత్త వీసీల కోసం యూనివర్సిటీలో సెర్చ్ కమిటీ ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి మృతి

జగిత్యాల టౌన్, మే 21: జిల్లా కేంద్రంలోని 10వ వార్డులోని లింగంపేట శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన నిమ్మని శిరీష తన కూతురు విన్మయి(3)తో కలిసి లింగంపేటలో ఎల్లమ్మ పట్నాల కార్యక్రమానికి హాజరైంది. తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం శిరీష నడుపుతున్న వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో వాహనంపై ఉన్న చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన జగిత్యాలలోని ఆసుపత్రికి తరలించగా మృతి చెందింది. తల్లి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాలకుర్తిలో వ్యక్తి..

పాలకుర్తి, మే 21: మండల పరిధిలోని ఎయిర్‌పోర్టు సమీపంలో మంగళవారం జరిగిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో జయ్యారం గ్రామానికి చెందిన జంగ శంకర్(40) మృతిచెందాడు. ధర్మారం ఎక్స్‌రోడ్డు నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా కొత్తపల్లి గ్రామం నుంచి ఎక్స్‌రోడ్డుకు వెళ్తున్న పోతు నరేష్ ద్విచక్రవాహనంపై వచ్చి బలంగా ఢీకొట్టడంతో శంకర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతునికి భార్య శిరీష, కూతూరు వైష్ణవి, కుమారుడు చర్రి ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

చొప్పదండి, మే21: చొప్పదండి మండంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన బైరగోని ఆనందం(45) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉపేంద్రచారి కథనం మేరకు బైరగోని ఆనందం రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆరునెలలుగా వ్యాపారం నడవకపోవడంతో నష్టాలపాలై జీవితంపై విరక్తి చెంది మంగళవారం తెల్లవారు జామున ఇంటిముందు బాల్కని ఇనుప చువ్వకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టాలు వచ్చి తరచు బాదపడుతుండే వాడని, ఆనందం భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడ రూరల్, మే 21: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. ఎదురుగట్ల గ్రామంలో అదే గ్రామానికి చెందిన పస్తం శ్రీనివాస్ ఆటోలో అక్రమంగా 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తర లిస్తుండగా మంగళవారం రూరల్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తే చర్యలుంటాయని ఎస్సై హెచ్చరించారు.

రాయికల్‌లో భారీ చోరీ

సుమారు 40 తులాల బంగారం, రూ.లక్ష అపహరణ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, పోలీసులు

రాయికల్, మే 21: రాయికల్ పట్టణంలో మంగళవారం రాత్రి భారీ చోరీ జరిగింది. పట్టణానికి చెందిన బుడిక విజయలక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి భారీ చోరీకి పాల్పడ్డారు. మంగళవారం సాయంత్రం బంధువుల ఇంటి నుంచి తన ఇంటికి చేరుకున్న విజయలక్ష్మికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉండ టంతో అనుమానంతో ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇచ్చి ఇంట్లోకి వెళ్లింది. ఇంట్లో బీరువా పగులగొట్టి ఉండగా, అందులో ఉన్న సుమారు 40 తులాల బంగారం, రూ.లక్ష నగదు మాయం కావడంతో చోరీ జరిగినట్లు గ్రహించింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, జగిత్యాల టౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై అజయ్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరుపుతున్నారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ సంఘటనపై డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్ వివరాలు సేకరిస్తున్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

సుల్తానాబాద్, మే 21 : మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన వేల్పుల అంజయ్య(55) అనే గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. రోజువారిగా మంగళవారం కూడ అంజయ్య గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. వ్యవసాయ బావి దగ్గర గొర్రెలు మేస్తుండగా పక్కనే ఉండి గమనిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి బావిలో పడి మృతిచెందాడు. అంజయ్యకు భార్య కేతమ్మతో పాటు కుమారుడు ఉన్నాడు. కేతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీధర్



రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కొడిమ్యాల, మే 21 : డెంగ్యూ వ్యాధి రాకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పి. శ్రీధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ శిబిరాన్ని, ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఓపీ వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మహిళ శిబిరానికి వస్తున్న మహిళ వివరాలను తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ప్రజలకు డెంగ్యూ బారిన పడకుండ తీసుకోవాలిసిన జాగ్రత్తలపై అవగాహన కలిపించాలన్నారు. ఈ పరిశీలనలో వైద్యాధికారి, పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, హెచ్‌వీ వెంకటనర్సమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ప్రభాకర్

కొడిమ్యాల, మే 21 : కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇదే కళాశాలలో ఈసీఈ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న బి. ప్రభాకర్‌ను నియమిస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ డా.. కె. వెంకటేశ్వర్‌రావు సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విదులు నిర్వహించిన కామాక్షిప్రసాద్ జేఎన్‌టీయూ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా బదిలీ అయినారు. నాచుపల్లి జేఎన్‌టీయూ వైస్ ప్రిన్సిపాల్ డా.. టి. వేణుగోపాల్‌ను సిరిసిల్ల జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్‌గా నియామకం చేశారు.

23 నుంచి బీరప్పస్వామి ఉత్సవాలు

కొడిమ్యాల, మే 21 : మండలంలోని పూడూర్ గ్రామంలో ఈ నెల 23 నుంచి 31 వరకు నిర్వహించు బీరప్పస్వామి ఉత్సవాలకు బీరప్ప ఆలయం ముస్తాబైంది. కురుమ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆలయానికి రంగులను వేసిఆలయం పరిసరాల్లో చలువ పందిళ్లను వేశారు. 23న పోచమ్మ బోనాలు, 24న బీరప్ప మహంకాళమ్మ వారికి అభిషేకం, 25న వీర గందాలతో గంగ బోనం, 26న సుంకు, సురుగువేయుట, 27న పెల్లి బోనాలు, బీరప్ప-కమరావతి కల్యాణం, 28న జోగు తిరుగుట, నాగవెల్లి బోనాలు, 29న నావెల్లి పట్నం-అగ్ని గుండాలు, 30న ఎట్టి ముల్లెలు మోయుట, 31న గారడి వేషం, దిష్టి కుంభం కార్యక్రమాలను కార్యక్రమాలను నిర్వహిస్తామని కురుమ సంఘం వారు తెలిపారు.

మఠమాంజనేయ ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

మల్యాల, మే 21: మల్యాలలోని శ్రీ మఠమాంజనేయ స్వామి సంస్థాన పంచవింశతి(25వ) వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రోటిగూడ శ్రీహరి మౌనస్వామి ఆధ్వర్యంలో రెండు రోజుల కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి పంచామృత అభిషేకములు తదితర పూజలు నిర్వహించారు. భగవద్గీత హవన యజ్ఞం, పారాయణం చేశారు. అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు మిట్టపల్లి లక్ష్మీనారాయణ, గాజుల మల్లేశం, మోహన్ హనుమాన్ దీక్షపరులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా జలందర్

గొల్లపల్లి, మే 21 : గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన కోమల్ల జలేంధర్ బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా మంగళవారం నియమితులయ్యారు. ఈ మేరకు జలేంధర్‌ను నియమిస్తూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఉత్వర్వులు అంజేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. తనను నియమించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు జలేంధర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమితులైన సందర్భంను పురస్కరించుకుని జడ్పీటీసీ జలేంధర్, పార్టీ మండల కో-ఆర్డినేటర్ గంగాధర్ జలేంధర్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అల్పాహారం పంపిణీ



అల్పాహారం పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కోరుట్ల, మే 20 : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్పాహారం పంపిణీ కొనసాగుతుంది. క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ఉచిత అల్పాహారం పంపిణీ మంగళవారం 97 రోజులకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్, కోటి నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్ సభ్యులు అడేపు కమల - మధు, వనపర్తి రమ్య - చంద్రమోహన్, కుందారపే పేమలత - మహేందర్, కేజీ కృష్ణ, అల్లాడి ప్రవీణ్, ఎలిమిల్ల ఉసా కిరణ్, ఇల్లెందుల వెంకటరాములులతో పాటు వైద్యులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కోరుట్ల యువకుల ప్రతిభ

కోరుట్ల, మే 20 : హైదరాబాదులోని కోటి హనుమాన్ వ్యాయమశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో కోరుట్ల యువకులు ప్రతిభ కనపరిచారు. పట్టణానికి చెందిన కల్లెడ రోహిత్ బెంచి ప్రెస్, డెడ్లిఫ్ట్, ఓవర్ ఆల్ పవర్ లిఫ్టింగ్‌లో మూడు బంగారు పతకాలు సాదించంగా, మరో యువకుడు ఠాకూర్ బెంచీ ప్రెస్‌లో బంగారు పతకం, ఓవర్ అల్ పవర్ లిఫింగ్‌లో వెండి పతకం సాదించారు. ప్రతిభ కనపరిచిన యువకులను పట్టణానికి చెందిన పలువురు అభినందించి సన్మానించారు.

పచ్చి రొట్ట విత్తనాలు వినియోగించుకోవాలి

కోరుట్ల రూరల్, మే 20 : పచ్చి రొట్ట ఎరువుల వల్ల బుసారం పెరిగి రసాయనానికి ఎరువుల వినియోగం తగ్గుతుందని రైతుల పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలను వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి నాగమణి అన్నారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయ వద్ద సబ్సిడీపై వచ్చిన జనుము, జెలుగా విత్తనాలను వ్యవసాయ అధికారి తన సిబ్బంది కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు సలహాలను అందించారు. పచ్చి రొట్ట ఎరువుల వల్ల రైతులకు ఖర్చు తగ్గి నెలలో సేంద్రియంగా ఎరువు లభ్యత పెరుతుందన్నారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఈఓలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు కృషి

ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



ధర్మపురిలో నివాళులు అర్పిస్తున్న అడ్లూరి, నాయకులు

ధర్మపురి, మే 21: ధర్మపురి మండల కేంద్రంలో నంది విగ్రహ చౌరస్తా వద్ద దేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పలువురు కాంగ్రెస్ నేతలు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ 40 ఏళ్ల వయస్సులో భారత యువ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. ప్రధాన మంత్రిగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంస్కరణలు తీసుక వచ్చినట్లు తెలిపారు. దేశాభివృద్ధి కోసం పోరాటం చేసి ప్రాణాలు అర్పించిన మహా వ్యక్తి అంటూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. రాజీవ్‌గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కు రవీందర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుల చిలుముల లక్ష్మణ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, మండల అధ్యక్షులు రాందేని మొగిలి, పట్టణ అధ్యక్షులు అప్పం తిరుపతి, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు ఒజ్జల లక్ష్మణ్, మైనార్టీ అధ్యక్షులు ఎండీ రఫియొద్దీన్, ఆశెట్టి శ్రీనివాస్, సుముఖ్, స్తంభంకాడి గణేష్ పాల్గొన్నారు.

కోరుట్ల : దేశ ప్రదానిగా ఉన్నపుడు రాజీవ్ గాంధీ దేశంలో ఐటి రంగంలో రాణించడానికి ఎంతో కృషి చేసాడని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మంగళవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో రాజీవ్ రాంధీ వర్ధంతిని స్థానిక నాయకులతో కలిసి జరిపారు. రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు మాట్లాడారు. రాజీవ్ గాంధీ ప్రదానిగా ఉండి అన్ని రంగాల అభివృద్ధి దిశగా నడిపించాడని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ల్ మోర్తాడ్ లక్ష్మినారాయణ, ఎంబేరి నాగభూషణం కాంగ్రెస్ నాయకులు కొంత రాజం, పెరుమాండ్ల సత్యనారాయణ, రాజోజి సదానంద చారీ, అడెపు మధు, మచ్చ కవిత, స్కోగ్రబీ, చదలు సత్యనారాయణ, మ్యాకల నర్సయ్య, ఎంబేరి సత్యనారాయణ, చిటిమెల్లి రంజిత్ గుప్తా, రియాజ్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి : దేశ మాజీ ప్రదాని రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపట్టానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొమిరెడ్డి కరంచంద్ ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యామ రాజయ్య, పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జెట్టి లక్ష్మణ్, మార్గం గంగాధర్, మాధవరెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రణయ్, వెంకటేష్, హరికుమార్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట మంగళవారం భారత మాజీ ప్రదాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, రాష్ట్ర పీసీసీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, స్వామి, లచ్చిరెడ్డి, ప్రసాద్, మల్లేశంయాదవ్, నాగార్జున్, నర్సయ్య, గంగరాజం, రమేష్, లింగరాజు, లక్ష్మన్ పాల్గొన్నారు.

కథలాపూర్ : దేశ మాజీ ప్రదాని రాజీవ్‌గాంధీ వర్ధంతి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. రాజీవ్



మెట్‌పల్లిలో...



కోరుట్లలో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారని నాయకులు పేర్కొన్నారు. దేశానికి రాజీవ్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు పులి హరిప్రసాద్, అల్లకుంట లింగంగౌడ్, సత్యనారాయణ, రవి, నారాయణరెడ్డి, సంతోష్ ఉన్నారు.

బుగ్గారం : మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించు కుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా మండల అధ్యక్షుడు వేముల సుభాష్ మాట్లాడుతూ ఆయన ఆశయాలను ప్రతీ ఒక్కరు కొనసాగించాలని, రాజీవ్ గాంధీ దేశ ప్రజల గుండెల్లో నిత్యం సంజీవుడిగానే ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, నాయకులు అంజిత్ కుమార్, శ్రీనివాస్, ప్రేమ్ కుమార్, పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని నాయకులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని విపత్కర పరిస్థితిలో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుంద్రా శ్రీనివాస్‌రెడ్డి, కోటగిరి ఆనంద్‌గౌడ్, ఏలేటి నర్సారెడ్డి, లక్ష్మారెడ్డి, లక్ష్మారెడ్డి, రాజారెడ్డి, రాకేష్, భూమయ్య, నరేష్, రాజేందర్ పాల్గొన్నారు.

పెగడపల్లి : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి ఆయన చేసిన సేవలను స్మరిస్తూ, ఆయన ఆశయ సాదనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, తిరుపతి, రాజు, కిషన్ పాల్గొన్నారు.

‘అమ్మ ఆదర్శం’ పనులకు ఆటంకం..

- మురిగిపోతున్న రు. 2.13 కోట్ల నిధులు
- మేస్త్రీల కొరతతో ముందుకు సాగని పనులు
- మిగలింది కేవలం పది రోజులే



తాండ్రియాల పాఠశాల

కథలాపూర్, మే 21 : అసౌకర్యాలతో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగు పరిచేందుకుగాను ప్రభుత్వం అమ్మ ఆదర్శం పేరిట కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. గతంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఎన్నికలు నిర్వహించి కమిటీలు ఏర్పాటు చేసి పాఠశాలల అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేశారు. ప్రభుత్వం నుంచి విడుదలయ్యే ప్రతీ గ్రాంటు ఈ ఎస్ఎంసీల ద్వారానే ఖర్చు చేసేవారు. ఈ క్రమంలో రాజకీయ జోక్యం పెరిగి హెచ్ఎంలతో ఎస్ఎంసీ చైర్మన్ల మధ్య విభేదాలకు తావిచ్చింది. ఆ ప్రభావం పాఠశాలల అభివృద్ధిపై పడడంతో తాజాగా ప్రభుత్వం అమ్మ ఆదర్శం పేరుతో పలు మార్పులు చేశారు. స్థానిక గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలితో కలిసి హెచ్ఎంలు జాయింట్ ఖాతా తీసి ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు అందులో జమ చేస్తుంటారు. వీవో అధ్యక్షురాలే పాఠశాల కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తుంటారు.

● నిధులు విడుదలైనా పనులు నత్తనడక

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మన ఊరు మన బడి కింద 16 పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టారు. ఆ పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. కాగా కాంగ్రెస్ సర్కారు ఏర్పడ్డాక ఆ పాఠశాలలను మినహాయించి 27 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మౌళిక వసతుల మెరుగు కోసం నిధులు కేటాయించింది. తాగు నీటి వసతి కోసం రు. 50.63 లక్షలు, విద్యుద్దీకరణకు రు. 27.19 లక్షలు, మైనర్ రిపేర్ల కోసం రు. 37.31 లక్షల నిధులను విడుదల చేసింది. ఇందులో బాలికల మరుగుదొడ్ల కోసం ప్రత్యేకంగా నిధులు వెచ్చించారు. ఈ పనులను పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్ల పర్యవేక్షణలో చేపట్టాలని ఆదేశించగా పనులు పూర్తిగా నత్తనడకన సాగుతున్నాయి. మొదటగా పాఠశాలకు రు. 25 వేల చొప్పున నిధులు అత్యవసరంగా ఇచ్చి విద్యుద్దీకరణ చేపట్టాలని జిల్లా అధికారులు సూచించారు. ఆ పనులు నామమాత్రంగా కొనసాగుతున్నాయి. మరుగుదొడ్లు, ఇతరత్రా మైనర్ రిపేర్ల పనులకు మేస్త్రీల కొరత ఏర్పడ్డట్లు తెలుస్తోంది. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలోపు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పనులు పూర్తి కావడం అనుమానంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

● పాఠశాలల్లో పనుల పూర్తికి చర్యలు

జ్ఞానేశ్వర్, ఏఈ పీఆర్

అమ్మ ఆదర్శం కింద చేపట్టనున్న పాఠశాలల అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రు. 25 వేల చొప్పున నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. కరెంట్ పైపులు బిగించే పనులు పూర్తి కావస్తున్నాయి. మిగిలిన పనులు చేపట్టడానికి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నాం.

ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, మే, 21 : ప్రభుత్వం కళాశాలలో చదివే విద్యార్థులకు అందజేస్తున్న సేవలను స్వదినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి, ప్రిన్సిపాల్ నారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని ధాంరాజ్ పల్లి, సంగెం గ్రామంలో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఇంటికి వెళ్లి ప్రభుత్వం జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు అందిస్తున్న సేవలను తల్లిదండ్రులకు వివరించారు. జూనియర్ కళాశాలలో చదివి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఇంజనీర్ విద్యను ప్రభుత్వం అందిస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం నాంచర్ల రాజేష్, శ్రీనివాస్, నరేష్, అరవింద్, రాజశ్రీ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్

గొల్లపల్లి, మే 21 : మండలంలోని భీంరాజ్ పల్లె గ్రామంలో భీంరాజ్ పల్లె బొమ్మెన కుమార్ ఆధ్వర్యంలో బీటీఆర్ వాలీబాల్ టోర్నమెంట్‌ను మంగళవారం నిర్వహించారు. స్వర్గీయ ఎరసాని రాజయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వాహకులు బొమ్మెన కుమార్ క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం టోర్నమెంట్‌ను ప్రారంభించారు. పోటిల్లో నాలుగు వాలీబాల్ టీంలు పాల్గొని విజేతగా నిలిచేందుకు హోరాహోరీగా శ్రమించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు ప్రైజ్‌మనీతో పాటు ట్రోపీని స్పాన్సర్లు బొమ్మెన కుమార్, ఆయన కూతురు బొమ్మెన ముక్తామణి అందజేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్, వెంకటేశం, స్వామి, లచ్చయ్య, మహేష్, సాగర్, రవి, రమేష్ పాల్గొన్నారు.

రేపు దుంపెట లక్ష్మీనరసింహస్వామి జాతర

కథలాపూర్, మే 21 : ఈ నెల 23న మండలంలోని దుంపెట శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతరోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 22న స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, రాత్రి భేరిపూజ, 23న పౌర్ణమి, ఉపవాస ములు, జాతర, 24న తెల్లవారుజాము న రథోత్సవం, రాత్రి పుష్పయాగం నాగవెల్లి వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో జాతరకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

25 లోపు ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

కథలాపూర్, మే 21 : ఈ నెల 25లోపు ఇంట ర్మీడియేట్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో చేరే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ తాటికొండ నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 40 చొప్పున సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జీవన్ రెడ్డి పూజలు

రాయికల్, మే 21: మండలంలోని ఒడ్డెలింగాపూర్ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ తల్లి పట్నాల్లో నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి మంగళవారం పాల్గొన్నారు. ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా నృసింహ స్వామి జయంతి

జగిత్యాల టౌన్, మే 21: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణీ పేటలో ఉన్న శ్రీ లక్ష్మి నృసింహ స్వామి ఆలయంలో మంగళవారం లక్ష్మి నృసింహ స్వామి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేద పండితుడు పూర్ణానంద చార్యుల ఆధ్వర్యంలో స్వామి వారకలు పానకాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఉన్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ




బద్దిపోచమ్మ ఆలయంలో బారులుదీరిన భక్తులు

వేములవాడ టౌన్, మే 21 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. డప్పు చప్పుళ్లతో, శివసత్తుల నృత్యాలతో భక్తులు ఆలయానికి చేరుకున్నారు. సుమారు రెండు గంటలపాటు క్యూలైన్‌లో నిరీక్షించిన భక్తులు ఆలయంలోకి ప్రవేశించి అమ్మ వారికి ఒడిబియ్యం, నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో అమ్మవారికి బలి ఇచ్చేందుకు పొట్టేలును తీసుకొచ్చిన భక్తుల నుంచి కళ్ల సాక పట్టేందుకు రూ. 50 నుంచి వంద వసూలు చేయడంతో గొడవ చోటు చేసుకుంది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో డబ్బులు వసూలు చేస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

బాబోయ్.. శునకాలు కోతులు

- దాడులతో బెంబేలెత్తుతున్న జనాలు
- గాయాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- నాలుగునెలల్లో 361 మందిపై దాడి





మల్యాల, మే 21: కోతులు, శునకాలతో సహవాసం ప్రజలకు నిత్యకృత్యం అయింది. గుంపులుగా ఇళ్లపై దండెత్తుతున్న కోతులు, గ్రామాల్లోని శునకాల సమూహం ప్రజలపై దాడులకు పాల్పడుతుంది. దీంతో జనాలు తీవ్ర గాయాల పాలు అవుతున్నాయి. శునకాలు, కోతుల బెడదతో జనాలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. మండలంలో ఇటీవల శునకాలు, కోతుల దాడులు తీవ్రం అయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి తీసు కువస్తున్న కోతులను కొండగట్టు ప్రాంతంలో విడిచిపెట్టివెలు తుండడంతో కోతులు సమీప గ్రామాలకు చేరుకుంటూ బీభత్సం సృష్టిస్తున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు కోతులు, శునకాల భారిన పడుతూ గాయాల పాలు అవుతున్నారు.

మల్యాల మండలంలో మల్యాల, ముత్యంపేట, బల్వంతాపూర్, సర్వాపూర్, నూకపల్లి, రామన్నపేట, మద్దుట్ల, తాటిపల్లి తదితర గ్రామాల పరిధిలో కోతుల బెడద అధికంగా ఉంది. మండల వ్యాప్తంగా శునకాల దాడులు ఉన్నాయి. నిత్యం కోతుల గుంపులు ఆయా గ్రామాల్లో ఇళ్ల పీకి పందిరి వేస్తున్నాయి. ఇళ్లపై చేరుకుంటున్న కోతులు ఇళ్లపై కప్పులను ధ్వంసం చేస్తుండగా ఇళ్లపై కప్పులను మార్చుకుంటూ ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. శునకాలు, కోతులు ఇళ్లల్లో ఉన్న వారిపై దాడులు చేస్తు భయందోళనకు గురి చేస్తున్నాయి. గాయపడిన వారితో నిత్యం మల్యాలలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రద్దీగా ఉంటుంది. కోతుల బెడద నివారణకు గతంలో మల్యాల, తాటిపల్లి తదితర గ్రామాల్లో కొండ ముచ్చులను తీసుకువచ్చినప్పటికీ వాటి సంరక్షణ ఇబ్బందికరంగా మారడంతో వాటిని వదిలిపెట్టారు. దీంతో కోతులు నిత్యం గ్రామాల్లో హల్‌చల్ చేస్తూ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నా యి. ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● 361 మంది బాధితులు

గత జనవరి నుంచి గత నెల ఎప్రిల్ వరకు 361 మంది శునకాలు, కుక్కల బారిన పడి తీవ్ర గాయాల పాలయ్యారు. ఇందులో చేతులు, కాళ్లు విరిగిన వాళ్లు కూడా ఉన్నారు. మల్యాల పీహెచ్‌సీలో నాలుగు నెలల్లో కుక్క కాటుకు 207మంది, కోతుల దాడికి 139మంది గురి అయిన వారు చికిత్స పొందారు. మిగితా అనేక మంది వాటి బారిన పడి ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ చికిత్స పొందిన వారూ ఉన్నారు.

చికిత్సపై నిర్లక్ష్యం వద్దు

మౌనిక, వైద్యాధికారి, మల్యాల

కోతులు, శునకాల దాడులకు గురి అయిన వారు తప్పకుండా చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. మూడు ఆ పై విడతల వారిగా చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. గాయాన్ని ఎప్పుడూ శుభ్రం చేస్తూండాలి. గాయ పడిన వారికి మల్యాల పీహెచ్‌సీలో తగు చికిత్స అందించడం జరుగుతుంది.